# పాఠం 5

# “వ్యభిచార మనస్సు”

## (హోషేయ 5)

4వ అధ్యాయంలో ఇశ్రాయేలు మీద “ఆరోపణ చేసిన” తరువాత, తరువాత అధ్యాయాలలో దేశం యొక్క అనైతిక కార్యకలాపాలు మరియు వాటి ప్రతిఫలం గురించి దేవుడు చెప్తున్నాడు. యరొబాము ఆరంభించిన “అనైతిక” యాజకత్వాన్ని అనుసరిస్తున్న యాజకులను గురించి చెప్తూ 5వ అధ్యాయం ప్రారంభమవుతుంది. అతనివలన, ఉత్తర రాజ్యం ఉన్నంత కాలం అన్యదేవతారాధన జరుగుతూనే ఉంది (చూడండి 1 రాజులు 12).

### దేవుని ఆరోపణ (5:1–4)

> 1యాజకులారా, నా మాట ఆలకించుడి; ఇశ్రాయేలువారలారా, చెవిని బెట్టి ఆలోచించండి; రాజ సంతతి వారలారా, చెవి యొగ్గి ఆలకించుడి, మీరు మిస్పా మీద ఉరిగాను తాబోరు మీద వలగాను ఉన్నారు గనుక మిమ్మును బట్టి ఈ తీర్పు జరుగును. 2వారు మితిలేకుండ తిరుగుబాటు చేసిరి గనుక నేను వారినందరిని శిక్షింతును.

2వ వచనం యొక్క హెబ్రీ మూలం క్లిష్టంగా ఉంటుంది, దాన్ని బట్టి తర్జుమాలు భిన్నంగా ఉంటాయి. NRSV 5:1బి, 2: లో ఇలా ఉంటుంది:

> “మీరు మిస్పా మీద ఉరిగాను తాబోరు మీద వలగాను మరియు *షిత్తీములో లోతైన లోయగానున్నారు గనుక నేను వాటినన్నిటిని నశింపజేతును*” (నొక్కి చెప్పింది నాది).

ఇదే రకమైన అనువాదం కోసం, 5:2ఎ REB మరియు NJB తర్జుమాలను చూడండి. “వారి తిరుగుబాటును బట్టి వారు నశింతురు” అని NAB చెప్తుంది. “నశించునంతగా తిరుగుబాటుదారులు ఉందురు” (NIV) మరియు “నాశనములో తిరుగుబాటుదారులు ఉందురు” (NKJV) అని వేరే తర్జుమాలు చెప్తున్నాయి. ఒక వేళ NIV చెప్పింది సత్యం అయితే, ఉత్తర రాజ్యంలోని రాజులు, అధిపతులు జరిగించిన “సంహారము” లేక హింసాకాండ గురించి ఇది చెప్తుంది (ఉదాహరణకు చూడండి 2 రాజులు 15).[1]

ఇశ్రాయేలు మరియు యూదా సరిహద్దుల్లో “మిస్పా” అన్న ఊరు ఉన్నగాని ఇక్కడ చెప్పబడిన మిస్పా ఉత్తర రాజ్యంలోనే ఉన్న యోర్దాను నది తూర్పున గిలాదును సూచిస్తుంది.[2] “తాబోరు” అనేది ఉత్తర రాజ్యంలోని కొండపేరు. ఇది ఇస్సాఖారు సరిహద్దుల్లో గిల్బోవ పర్వతానికి ఉత్తరంగా పన్నెండు మైళ్ళు, నజరేతుకు ఆగ్నేయంగా ఐదున్నర మైళ్ళ దూరంలో ఉంటుంది.[3]

ఇశ్రాయేలు మీద దేవుడు చేసిన ఆరోపణ ప్రధానంగా ప్రజల నాయకులు, యాజకులు[4] మరియు రాజునకు వ్యతిరేకంగా చేసినది. ప్రజలు పాపం చేశారు, దేవుడు వారిని క్షమించలేదు. యాజకులు, రాజును కలిపి “ఇశ్రాయేలు వారలారా” అని అంటున్నాడు. నాయకులు పాపం చేశారు (5:10 చూడండి, “అధిపతులను” సూచిస్తుంది). వారు మిస్పా

మీద ఉరిగాను "తాబోరు మీద వలగాను" ఉన్నారు (5:1). ఎలా? ఉత్తర రాజ్యంలో ఈ ప్రాంతాల్లో అన్యదేవతారాధనను జరిగించడం ద్వారా! ప్రజలు వారి వలలో పడిపోయారు. పక్షి ఉచ్చులో చిక్కుకున్నట్టు, ప్రజలు తమ నాయకులను అనుసరించడం ద్వారా వారు వలలో పడిపోయారు. అటువంటి పాప క్రియల వలన, దేవుని మీద తిరుగుబాటు చేసిన వారందరూ ("తిరుగాబాటు దారులు" లేక ఎదిరించువారు), "నాశనంలోనున్న వారందరూ" దోషము ఆరోపించబడిన వారందరూ దేవుని శిక్షనొందుతారు (5:2).

> [3]ఎఫ్రాయిమును నేనెరుగుదును. ఇశ్రాయేలు వారు నాకు మరుగైన వారు కారు. ఎఫ్రాయిము, నీవు ఇప్పుడే వ్యభిచరించుచున్నావు; ఇశ్రాయేలు వారు అపవిత్రులైరి. [4]తమ క్రియల చేత అభ్యంతరపరచబడిన వారై వారు తమ దేవుని యొద్దకు తిరిగి రాలేకపోవుదురు. వారిలో వ్యభిచార మనస్సుండుట వలన వారు యెహోవాను ఎరుగకయుందురు.

దేవుని శిక్షనుండి ఇశ్రాయేలు తప్పించుకొనలేదు ఎందుకంటే దేవునికి ఇశ్రాయేలు తెలుసు. అది ఆయనకు "మరుగైయుండలేదు" (5:3ఎ).[5] "ఇశ్రాయేలు వ్యభిచరించుచున్నది" మరియు "వ్యభిచార మనస్సు కలిగియుంది" కాబట్టి దేవుడు ఇశ్రాయేలును శిక్షించనున్నాడు (5:3బి, 4; చూడండి 4:12). మరో మాటలో చెప్పాలంటే, వారు దేవునికి అపనమ్మకంగా ఉన్నారు. అన్యదేవతలను ఆరాధించడం ద్వారా వారు తమ భర్తకు ద్రోహం చేశారు. విచారకర విషయ మేమంటే, "తమ క్రియల చేత అభ్యంతర పరచబడినవారై తమ దేవుని యొద్దకు తిరిగి రాలేక పోవుదురు" (5:4). వారు పాపంలో నున్నంతకాలం దేవున్ని సమీపించలేరు. డెరెక్ కిడ్నర్ ఇలా వ్రాస్తున్నాడు.

> దేవుని యొద్దకు వచ్చుటకు "తమ క్రియలు వారిని అభ్యంతపరుస్తున్నాయి" అన్న మాటకు రెండు అర్థాలున్నాయి. పాపం చేసినవాడు తన దోషములకు బానిసైపోవడమే గాకుండా అతడి క్రియలు అతడు మంచి మాటలు పలుక కుండా చేస్తున్నాయి.[6]

"వారు యెహోవాను ఎరుగక యుందురు" (5:4). ఇశ్రాయేలు యొక్క స్థితి ఈ మాటలో కనబడుతుంది. ఈ మాటను బట్టి వారు దేవుని ఆజ్ఞలను అనుసరించకపోవడం వలన దేవునితో సరైన సంబంధాన్ని కలిగియుండలేదు అని అర్థమవుతుంది.

3వ వచనం ఆరంభంలో "ఎఫ్రాయిమును నేనెరుగుదును" అన్న మాటకు మరియు 4వ వచనం చివర్లోని "వారు యెహోవాను ఎరుగకయుందురు" అన్న మాటకు మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనబడుతుంది. "ఎఫ్రాయిము"[7] అను పదం ఉత్తర రాజ్యం ఇశ్రాయేలును సూచించేందుకు వాడబడింది. కానీ ఇక్కడ ఈ గోత్రం దేశం నుండి భిన్నంగా కనబడుతుంది.

### ప్రజల దోషము (5:5–7)

> [5]ఇశ్రాయేలుయొక్క అతిశయాస్పదము అతని మీద సాక్ష్యమిచ్చును. ఇశ్రాయేలు వారును ఎఫ్రాయిమువారును తమ దోషములో చిక్కుపడి తోట్రిల్లుచున్నారు; వారితో కూడ యూదా వారును తోట్రిలుచున్నారు. [6]వారు గొఱ్ఱెలను, ఎడ్లను తీసుకొని యెహోవాను వెదకబోదురు గాని ఆయన వారికి తన్ను మరుగు జేసికొనినందున వారికి కనబడకుండును. [7]యెహోవాకు విశ్వాస ఘాతకులై వారు అన్యులైన పిల్లలను కనిరి; ఇంకొక నెల అయిన తర్వాత వారు వారి స్వాస్థ్యములతో కూడ లయమగుదురు.

ఇశ్రాయేలు తమ ఆస్తి మరియు సంపదలో గర్వపడినందువలన వారు యెహోవానుండి వెనుదిరిగిపోయారు.[8] నీతిమంతులైన వారు గర్వపడకుండా తమ దేవుని ఆశీర్వాదాలను బట్టి దేవునికి కృతజ్ఞులై యుండాలి. “ఇశ్రాయేలు యొక్క అతిశయం” దేవుని సూచించవచ్చు. సి. యఫ్. కెయిల్ “ఇశ్రాయేలు అతిశయం” అన్న పదం “ఇశ్రాయేలు మహిమయైన” – యెహోవా దేవుని సూచిస్తుందని వ్యాఖ్యానించినట్లు పాల్. టి. బట్లర్ పేర్కొంటున్నాడు. కానీ ఇక్కడ ఇశ్రాయేలు యొక్క “అతిశయాస్పదముగా” చెప్పబడిందని అతడు పేర్కొన్నాడు.[9] ఇశ్రాయేలు యొక్క దోషము అది తొట్రిల్లేలా చేస్తుంది. అలాగే పొరుగు రాజ్యమైన యూదా కూడాను తోట్రిల్లుతుంది (5:5). నిజానికి, ఇశ్రాయేలులోని బయలు దేవతారాధన యూదా రాజ్యంలోకి కూడ యెజెబేలు ద్వారా ప్రవేశించింది.

ఉత్తర రాజ్యంలోని వారు దేవుని నుండి ఎంతగా వైదొలగిపోయారంటే, వారు ఆయన్ను ఎంతగా వెదకినా, ఆయనకు “ఎన్ని గొఱ్ఱెలను, ఎద్లును సమర్పించినా,” వారు దేవున్ని కనుగొనలేరు. ఎందుకంటే ఆయన వారికి తన్ను “మరుగు చేసుకున్నాడు” (5:6). ఈ వాక్యాన్ని బట్టి ఇశ్రాయేలు “తిరిగిరాకుండలేని” స్థితికివెళ్ళారు, నాశమునకు చెరువై పశ్చాత్తాప అవకాశాన్ని కూడా కోల్పోయింది అని అర్థమవుతుంది. మరికొన్ని వాక్య భాగాల్లో ప్రజలు దేవునివైపు తిరగాలని హోషేయ కోరాడు. అంటే దేశానికి పశ్చాత్తాపపడే అవకాశం ఉందని అర్థం. ఇశ్రాయేలు యొక్క నాశనమునకు మరలా ఆత్మీయ వ్యభిచారమే కారణముగా చెప్పబడింది. వ్యభిచారంలోనున్న భార్య అనైతిక పిల్లల్నీ కంటుంది.[10] వారి అవిశ్వాస్యతకు ఫలితంగా “వారు వారి స్వాస్థ్యములతో కూడ లయమగుదురు” (5:7).[11]

## రాబోవు శిక్షను గురించిన హెచ్చరిక (5:8–15)

> [8]గిబియాలో బాకానాదము చేయుడి, రామాలో బూర ఊదుడి; బెన్యామీనీయులారా – మీ మీదికి శిక్షవచ్చుచున్నదని బేతావెనులో బొబ్బపెట్టుడి. [9]శిక్షా దినమున ఎఫ్రాయిము పాడైపోవును; నిశ్చయముగా జరుగబోవు దానిని ఇశ్రాయేలీయుల గోత్రపు వారికి నేను తెలియజేయుచున్నాను.

తరువాతదిగా సమీప భవిష్యత్తులో ఏం జరుగనుందో ప్రవక్త వివరంగా ప్రత్యేకించి బెన్యామీనీయులను ఉద్దేశించి చెప్తున్నాడు. వీరు యూదా యొక్క ఉత్తర సరిహద్దుల్లో వ్యాపించియున్నారు. హోషేయ యొక్క దర్శనంలో అష్షూరీయులు ఇదివరకే ఉత్తర రాజ్యాన్ని జయించి యుండి దక్షిణ రాజ్యాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నాడు (5:8).[12] (శత్రువులు సమీపిస్తున్నారని తెలిపేందుకు “బాకా” మరియు “బూరలను” ఊదుతారు.) అష్షూరీయులు ఉత్తర రాజ్యాన్ని జయించిన తరువాత ప్రజలను చెరగొని పోయిన తరువాత అది “పాడైపోవును” అని చెప్తున్నాడు – అలా రాజ్యపు నాశనం “నిశ్చయము” అని చెప్తున్నాడు ఇది ఖచ్చితంగా జరుగుతుంది (5:9).

> [10]యూదా వారి అధిపతులు సరిహద్దు రాళ్లను తీసివేయు వారివలెనున్నారు; నీళ్లు ప్రవహించునట్లు నేను వారి మీద నా ఉగ్రతను కుమ్మరింతును. [11]ఎఫ్రాయిమీయులు మానవుల పద్ధతిని బట్టి ప్రవర్తింపగోరువారు; వారి కఠికశ్రమ కలుగును, వారు శిక్షింపబడి హింస నొందుదురు బాధింపబడుదురు. [12]ఎఫ్రాయిమీయులకు చిమ్మటపురుగు వలెను యూదావారికి వత్సపురుగు వలెను నేనుందును. [13]తాను రోగియవుట ఎఫ్రాయిము చూచెను,

తనకు పుండు కలుగుట యూదా చూచెను అప్పుడు ఎఫ్రాయిము అష్షూరీయుల యొద్దకు పోయెను, రాజైన యారేబును పిలుచుకొనెను. అయితే అతడు నిన్ను స్వస్థపరచజాలడు, నీ పుండు బాగు చేయ జాలడు.

ఇశ్రాయేలు నాయకులు మాత్రమే గాక యుదావారి అధిపతులు కూడా శిక్షనొందనున్నారు. "వారు సరిహద్దు రాళ్ళను తీసివేయువారివలెనున్నారు" అనగా తనకు, తన పొరుగువాని స్థలమునకు మధ్యనున్న సరిహద్దును జరిపి అతని స్థలాన్ని దొంగలించువాని వలెనున్నారు. యూదా అధిపతులు ఇశ్రాయేలు నాయకుల వలెనే ఉన్నారు. వారు కూడా దేవుని ఉగ్రతను అనుభవించనున్నారు (5:10).[13]

తరువాతదిగా ఇశ్రాయేలు యొక్క పాపపు ప్రతిఫలం గురించి వాక్యం చెప్తుంది (5:11). దేవుని ప్రజలు ఆయన ధర్మశాస్త్రాన్ని గాకుండా "మానవ పద్ధతిని" అనుసరిస్తున్నారు. బహుశా ఈ వాక్యం దాను, బేతేలులో యరొబాము స్థాపించిన దూడలకు మ్రొక్కమని అతడు చేసిన ఆజ్ఞను గురించి చెప్తుండవచ్చు (1 రాజులు 12:28-33).[14] ఈ పాపమును బట్టి వారికి "అధిక శ్రమను కలుగజేయడం" ద్వారా దేవుడు ఇదివరకే శిక్షించాడు (5:11). దేవుడు వారికి "చిమ్మట పురుగు" మరియు "వత్సపురుగు" వలెనున్నాడు (వీటి వలన కర్ర చెడిపోతుంది); ఈ విధంగా ఇశ్రాయేలు, యూదాలను ఆయన వ్యాధిగ్రస్థులనుగా చేశాడు (5:12).

ఈ సమస్యకు ఇశ్రాయేలు ఒక పరిష్కారాన్ని కనుగొంది - అది ఇతర దేశాలనుండి[15] ప్రత్యేకించి అష్షూరు దేశం[16] నుండి సహాయాన్ని అర్థించడం. ఇందులో దేవుని యందలి నమ్మకం చూపించక పోవడం మరియు అన్యదేవతలను అంగీకరించడం అన్న విషయాలు ఇమిడియుండడం ద్వారా దేవుడు ఈ విధానాన్ని కొట్టివేశాడు. పురాతన కాలంలో సైన్యాలు తమ దేవతల పేరు మీద యుద్ధాలకు వెళుతుండేవి. ఇశ్రాయేలు మరో దేశంతో కలిసి పోరాడుతుంటే, వారు కూడా అన్యదేశపు అన్యదేవత పేరు మీదనే యుద్ధం జరిగించాల్సియుంటుంది. అయితే తమ అన్య దేశముల సహాయంతో ఇశ్రాయేలు ఆశిస్తున్న విమోచన దొరకదని హోషేయ ప్రకటిస్తున్నాడు. తమకు కలిగిన "రోగం" మరియు "పుండు" లనుండి తమకు స్వస్థత కలుగదు (5:13).

14ఏలయనగా ఎఫ్రాయిమీయులకు సింహమువంటివాడనుగాను, యూదావారికి కొదమ సింహమువంటివాడనుగాను నేనుందును. నేనే వారిని పట్టుకొని చీల్చెదను, నేను వారిని కొనిపోవుదను, విడిపించువాడొకడను లేకపోవును, 15వారు మనస్సు త్రిప్పుకొని నన్ను వెదకువరకు నేను తిరిగి నా స్థలమునకు పోవుదను; తమకు దురవస్థ సంభవింపగా వారు నన్ను బహు శీఘ్రముగా వెదకుదురు.

దేవుడు తన ప్రజల నిమిత్తం ఉద్దేశించిన శిక్ష గురించి మరోమారు మాట్లాడుతున్నాడు. ఆయన ఎఫ్రాయిమునకు "సింహముగా" ఉంటాడు; ఆ దేశాన్ని నశింపచేస్తాడు. "వారిని చీల్చివేస్తాడు" (5:14). తరువాత వారిని "కొనిపోతాడు," తను ప్రజల దురవస్థకు వారి మానాన వారిని వదిలివేస్తాడు. వారు కొనిపోబడిన తరువాత సహాయం చేయు వారు ఎవరునూ ఉండరు. ఇశ్రాయేలు యెడల ఆయన ఉద్దేశం కేవలం శిక్షించడం మాత్రమే కాదు. ఆయన ఉద్దేశం "వారు మనస్సు త్రిప్పుకుని, ఆయన్ను వెదుకునట్లు" చేయడం (5:15). వారు ఆలాగు చేసినపుడు ఆయన వారివైపు తిరుగుతాడు.

### దేవుడు ఎవరిని అంగీకరింపక తిరస్కరిస్తాడు? (5:4)

దేవుని యొద్దకు రావాలన్న ఆశ కలిగిన వారిని ఆయన అంగీకరింపకుండా తిరస్కరిస్తాడా? కొంతమంది విషయమై హోషేయ ఇలా చెప్తున్నాడు, "తమ క్రియల చేత అభ్యంతరపరచబడినవారై వారు తమ దేవుని యొద్దకు తిరిగి రాలేకపోవుదురు" (5:4). దీన్ని బట్టి వారు పాపంలో అడుగిడియున్నారు కాబట్టి వారికి దేవుని యొద్దకు తిరిగి వచ్చే ఆశ, ఆసక్తి సామర్థ్యం లేదు అని అర్థమవుతుంది. "వారు యెహోవాను వెదుకబోదురు గాని ఆయన వారికి తన్ను మరుగుచేసికానినందున వారికి కనబడకుండును" (5:6) అని ప్రవక్త చెప్తున్నాడు.

దేవున్ని వెదకినా గాని, ఎవరిని దేవుడు అంగీకరింపడు? ఎవరైతే పాపాన్ని జరిగిస్తూ, అదే సమయంలో దేవున్ని, ఆయన సన్నిదిని ఆనందించాలని కోరుకునే వారిని! ఇశ్రాయేలు పాపం జరిగిస్తూనే తన పాపపు మార్గాన్ని విడచిపెట్టకుండానే దేవున్ని సమీపించాలనుకోవడం నిష్ఫలమే!

ఈనాడు ప్రజలు కూడా అదే రీతిగానున్నారు దేవుడు తమ పక్షాన నున్నాడని అనుకుంటూ, ఆశీర్వాదాల కోసం ఆయనపై ఆధారపడుతూ పాపాన్ని మాత్రం విడచిపెట్టకయున్నారు. నేరస్థులు కూడా తమకు శ్రమ కలిగినప్పుడు ప్రార్థన అవసరత కోరుతుంటారు. ఒకేసారి రెండు రకాల జీవితాలను ఆస్వాదించడం కుదరదు. దేవున్ని ఆశ్రయించాలనుకున్న వారు పశ్చాత్తాపం పొందిన వారిగా నుండి ఇకమీదట పాపంలోనుండక ఆయన్ను సమీపించాలి.

ఒక వ్యక్తి పశ్చత్తాపం పొందినప్పుడు దేవుడతనిని అంగీకరిస్తాడు. "వారు మనస్సు త్రిప్పుకుని నన్ను వెదకు వరకు నేను తిరిగి నా స్థలమునకు పోవుదును" అని దేవుడు ఇశ్రాయేలు విషయంలో చెప్తున్నాడు (5:15). వారు తమ తప్పును ఒప్పుకుని దేవున్ని వెదకినప్పుడు ఆయన వారిని క్షమించి వారిని అంగీకరిస్తాడు. అలాగే, మనము పశ్చాత్తాపపడి ఆయన వైపు తిరిగితే, మనం గతంలో ఎంత పాపం చేసినా ఆయన మనల్ను అంగీకరిస్తాడు.

### మానవ ఆజ్ఞలను అనుసరించడం (5:11)

"ఎఫ్రాయిమీయులు మానవపద్ధతిని బట్టి ప్రవర్తింపగోరువారు. వారికధికశ్రమ కలుగును, వారు శిక్షింపబడి హింసనొందుదురు, బాధింపబడుదురు" అని హోషేయ 5:11 చెప్తుంది. ఈ మానవపద్ధతి లేదా ఆజ్ఞ అనేది యరొబాము కాలంలో దాను మరియు బేతేలులో అతడు నెలకొల్పిన బంగారు దూడలకు సాగిలపడి మ్రొక్కాలని అతడు చేసిన ఆజ్ఞ కావచ్చు. ఈ మానవ పద్ధతి ఆరాధన దేవున్ని సంతోషపెట్టలేదు. అదే విధంగా మనము ఈనాడు దేవుని వాక్యానికి లోబడకుండా మానవ పద్ధతులకు ఆకర్షించబడడం, వినడం ఎంతో ప్రమాదకరం (చూడుము మత్తయి 15:8, 9).

సూచనలు

[1]Allen R. Guenther, *Hosea, Amos*, Believers Church Bible Commentary (Scottdale, Pa.: Herald Press, 1998), 110. [2]Charles F. Pfeiffer, *Baker's Bible Atlas* (Grand Rapids, Mich.: Baker Book House, 1961), 310. [3]Ibid., 321. [4]ఈ యాజకులు అన్యదేవతల యాజకులైయుండవచ్చు లేదా రాజ్య విభజన తరువాత లేవీ గోత్రం కానీ గోత్రంనుండి యాజకులైనవారు కావచ్చు. రాజ్య విభజన తరువాత ప్రత్యామ్నాయ ఆరాధన స్థలాలు ఏర్పరచబడిన తరువాత యథార్థత గల యాజకులు దక్షిణ రాజ్యానికి వలస వెళ్ళిపోయారు. [5]"ఎఫ్రాయిమును నేనెరుగుదును" మరియు "ఇశ్రాయేలు వారు నాకు మరుగైనవారు కారు" అన్న పదాలకు ఒకటే అర్థం. (James Burton Coffman, *Commentary on the Minor Prophets,* vol. 2, *Hosea, Obadiah, and Micah,* rev. ed. [Austin, Tex.: Firm Foundation Publishing House, 1986], 89-90.) [6]Derek Kidner, *The Message of Hosea: Love to the Loveless,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1981), 59. [7]"ఎఫ్రాయిము దోషములెన్నో జరిగించిన గోత్రం, దోషిగా ఎంచబడినది" అని లియోన్‌వుడ్ అన్నారు. (Leon J. Wood, "Hosea," in *The Expositor's Bible Commentary*, vol. 7, *Daniel-Minor Prophets*, ed. Frank E. Gaebelein [Grand Rapids, Mich.: Regency Reference Library, Zondervan Publishing House, 1985], 190.) [8]Charles L. Feinberg, *The Minor Prophets* (Chicago: Moody Press, 1990), 33. [9]Paul T. Butler, *The Minor Prophets: The Prophets of the Decline-Obadiah, Joel, Jonah, Amos, Hosea,* Bible Study Textbook Series (Joplin, Mo.: College Press, 1968), 484; C. F. Keil and F. Delitzsch, *The Twelve Minor Prophets,* vol. 1, trans. James Martin, Biblical Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.), 88. [10]KJVలో "వింతైన పిల్లలు" అని ఉంది. ఇది ఇశ్రాయేలు యొక్క నమ్మక ద్రోహం, ఆత్మీయ వ్యభిచారాన్ని చూపుతుంది. "దేవునికి అవిశ్వాసులైన పిల్లలు" అన్న అర్థాన్ని హోమర్‌హైలే ఇస్తున్నాడు. (Homer Hailey, *A Commentary on the Minor Prophets* [Grand Rapids, Mich.: Baker Book House, 1972], 153.)

[11]"ఇంకొక నెల అయిన తర్వాత" (new moon) అన్న దానికి వారు చంద్రనెలారంభం రోజున అన్యదేవతలకు అర్పించే బలులు నెలలో వారికి నాశనం తెస్తాయన్న అర్థం ఇస్తుంది. (Ibid.) రాజ్యవిభజన తరువాత ఎక్కువమంది బెన్యామీనియులు యూదారాజ్యంలో చేరారు. [12]గిబియా, రామా రెండు నగరాలు ఉత్తరంలోని బెన్యామీను ప్రాంతాలు. ఇశ్రాయేలు సరిహద్దులోనివి. బెతావెను లేదా బెతేలు అన్నది ఉత్తర రాజ్యంలోని దక్షిణప్రాంతం. [13]ఇశ్రాయేలు నాశనం జరిగిన వందేళ్ళ తరువాత బబులోను వారి ద్వారా యూదా వారి మీదికి దేవుని "ఉగ్రత" వచ్చింది యూదా నాశనంలో ఎందుకు ఆలస్యం జరిగింది? హోషేయ తర్వాత ఏ ఇశ్రాయేలు రాజు పశ్చాత్తాప పడలేదు కానీ యూదా రాజులు కొంతమంది పశ్చాత్తాపపడి దేవుని వైపు తిరిగారు. ఇదే కారణం కావచ్చు. [14]Hailey, 154. [15]ఇశ్రాయేలు అన్యదేశంతో పొత్తు కోసం యత్నించడాన్ని చూడండి 7:8–12; 8:9, 10; 12:1. [16]రాజైన యారేబు అనేది అష్షూరు రాజును సూచించే అలంకార పద ప్రయోగం. హైలీ ప్రకారం, మసోరిటిక్ "టెక్ట్స్" లో కనబడే ఈ పదానికి "పోరాడే రాజు" లేదా "కలహించేవాడు" అని. (Hailey, 154.) "యారేబు" అనే పదం "గొప్పరాజు" అని NIV మరియు NRSV తర్జుమా చేసింది. రెండింటిలోను ఈ వాక్యం యొక్క అర్థం ఒకటే.